నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్,గురువారం 25 జనవరి 2024 | HYDERABAD



మెహిదీపట్నం రైతుబజార్ వద్ద నిర్మాణంలో ఉన్న స్కైవాక్



## టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ - 2024 డైరీ, క్యాలెండర్‌ను బుధవారం నాంపల్లి పబ్లిక్‌గార్డెన్‌లోని లలిత కళాతోరణంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేనీ ఆవిష్కరించారు.

# మెహిదీపట్నం స్కైవాక్‌కు తొలగిన అడ్డంకులు

**3380 చదరపు గజాల డిఫెన్స్ భూమి ఇచ్చేందుకు ఒప్పుకున్న కేంద్రం**

**మే నెలాఖరున ప్రజలకు అందుబాటులోకి స్కైవాక్**

సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : పాదచారుల భద్రతకు పెద్దపీట వేస్తూ మెహిదీపట్నంలో హెచ్‌ఎండీఏ చేపడుతున్న స్కైవాక్ నిర్మాణానికి కేంద్రం లైన్ క్లియర్ చేసింది. పెరిగిన ట్రాఫిక్ రద్దీ కారణంగా రోడ్లపై నడిచి వెళ్లే వారి భద్రత దృష్ట్యా ఇక్కడ స్కైవే నిర్మించాలనే ప్రతిపాదనలను కేసీఆర్ ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. మెహిదీపట్నం రైతుబజార్ ఎదురుగా ఉన్న బస్టాప్ నుంచి పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వే కింద నుంచి రోడ్డు అవతల వైపు రూ.34 కోట్లతో అత్యాధునిక నిర్మాణాన్ని చేపట్టింది. అయితే ఒకవైపు రక్షణ క్యాంపస్ స్థలం ఉండడంతో భూములను ఇచ్చేందుకు కేంద్ర రక్షణ శాఖ అంగీకరించలేదు. దీంతో రక్షణ శాఖ పరిధిలోని 0.51 ఎకరాల స్థలాన్ని తమకు బదిలీ చేయాలని అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పలుమార్లు రక్షణ శాఖ మంత్రిని కలిసి విన్నవించారు. దీంతో గత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించాయి. స్కై వే నిర్మాణానికి అవసరమైన మేరకు భూమిని కేటాయించేందుకు కేంద్రం బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో వీలైనంత త్వరగా ఈ స్కైవే నిర్మాణం చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చే మే నెలాఖరు నాటికల్లా ఈ స్కైవాక్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు పేర్కొన్నారు.



▲ **గోల్కొండ కోటలో.. సౌండ్ అండ్ లైట్ షో**

మెహిదీపట్నం, జనవరి 24 : దేశంలో పర్యాటక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి చారిత్రాత్మక గోల్కొండ కోటలో ఆధునీకరించిన సౌండ్ అండ్ లైట్ షో ను సినీ నటుడు చిరంజీవి, సినీ రచయిత (బాహుబలి), ఏఎస్ఐ విజయేంద్ర ప్రసాద్‌లతో కలిసి ప్రారంభించారు.



## ట్రాఫిక్ నియమాలు పాటించాలి

**జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్**

సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : పాఠశాల నిర్వాహకులు ట్రాఫిక్ నియమాలు పాటించడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు సైతం ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్ అన్నారు. రోడ్డు భద్రత మాసాన్ని పురస్కరించుకొని బుధవారం పాఠశాల యాజమాన్యాలతో ట్రాఫిక్ నియమాలపై కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. పాఠశాలలో పార్కింగ్ స్థలం లేకపోతే పరిసరాల్లో అద్దెకు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

# బీజేపీ-కాంగ్రెస్ దోస్తానా

**అధికారం కోసం మీర్‌పేటలో ఫ్రెండ్షిప్**

**ఢిల్లీ పార్టీల సిల్లీ పాలిటిక్స్**

**మీర్‌పేట కార్పొరేషన్‌లో అవిశ్వాసం నెగ్గగానే కండువా మార్పు**

- సంఖ్యాపరంగా స్పష్టమైన మెజార్టీ లేకపోయినా.. మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసానికి ప్రణాళిక
- కాసుల పండుగలా భావిస్తున్న కార్పొరేటర్లు
- బీజేపీ కౌన్సిలర్‌కు కార్పొరేషన్ మేయర్ పదవి
- పదవి రాగానే కాంగ్రెస్‌లో చేరేలా చీకటి ఒప్పందం

*ఆ రెండు పేరుకే జాతీయ పార్టీలు.. ఢిల్లీ స్థాయిలో జెండాలు-ఎజెండాలు వేరంటూ రాద్ధాంతం చేస్తాయి. కానీ గల్లీకొచ్చేసరికి గలీజు రాజకీయాలకు పాల్పడుతాయి. ముఖ్యంగా బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనలేక అసెంబ్లీ స్థాయిలోనే కాదు.. చివరకు స్థానిక సంస్థల పరిధుల్లోనూ చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నాయి. గతంలో అనేక పర్యాయాలు ఇదే రుజువు కాగా.. తాజాగా మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ వేదికగా ఢిల్లీ పార్టీలైన కాంగ్రెస్-బీజేపీ సిల్లీ చేష్టలు వెలుగు చూస్తున్నాయి. బీఆర్‌ఎస్ మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు రెండు పార్టీలు చీకటి ఒప్పందాలకు తెర లేపాయి. ఈ మేరకు బీజేపీకి చెందిన కార్పొరేటర్లు కాంగ్రెస్‌కు చెందిన నియోజకవర్గ స్థాయి నాయకుడి వద్దకు వెళ్లి మంతనాలు పూర్తి చేసినట్లు తెలిసింది. సంఖ్యాపరంగా స్పష్టమైన మెజార్టీ లేకపోవడంతో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు గాలం వేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం సంతకాల సేకరణ దశలో ఉన్న డర్టీ పాలిటిక్స్‌లో కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్లు సైతం భారీగానే డిమాండ్ చేస్తుండటంతో నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి.*

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్‌ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ ఉన్నది. మొత్తం 46 వార్డులు ఉండగా.. 25 స్థానాలను బీఆర్‌ఎస్ ఖాతాలో వేసుకున్నది. బీజేపీకి 14 వార్డులు దక్కగా.. కాంగ్రెస్ ఏడు స్థానాలకు పరిమితమైంది. మేయర్ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించగా.. బీఆర్‌ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ ఉండటంతో దుర్గ దీప్‌లాల్ చౌహాన్ మేయర్‌గా ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా బీఆర్‌ఎస్‌కు చెందిన తీగల విక్రంరెడ్డిని ఎన్నుకున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ ఇప్పుడు రాష్ట్రంలో రాజకీయం మారడంతో ఆ ప్రభావం మీర్‌పేట కార్పొరేషన్‌పై పడింది. కాకపోతే మేయర్ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించగా.. కాంగ్రెస్‌కు చెందిన 7 కార్పొరేటర్లలో ఎస్టీ మహిళ లేకపోవడంతో రెండు జాతీయ పార్టీలు చీకటి ఒప్పందానికి తెరలేపాయి. బీజేపీకి చెందిన కార్పొరేటర్ లీలా రవినాయక్‌ను తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ పావులు కదిపింది. ఈ మేరకు కాంగ్రెస్‌కు చెందిన నియోజకవర్గ స్థాయి నాయకుడి దగ్గర మంతనాలు కూడా పూర్తయినట్లు తెలిసింది. కాకపోతే బీజేపీకి చెందిన ఆమెను మేయర్‌గా చేసినట్లయితే కాంగ్రెస్ పార్టీకి ప్రయోజనం ఉండనందున.. మేయర్ పదవి రాగానే కాంగ్రెస్‌లో చేరేటట్లుగా ఒప్పందం జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే తరుణంలో కాంగ్రెస్‌కు చెందిన భాస్కర్‌రెడ్డిని డిప్యూటీ మేయర్‌గా ఎంపిక చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తున్నది.

### సరిపడని సంఖ్యాబలం

స్పష్టమైన మెజార్టీ లేనప్పటికీ కాంగ్రెస్ అవిశ్వాసానికి తెర లేపడంతో కార్పొరేటర్లు కాసుల పండుగలా భావిస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్, బీజేపీకి చెందిన కార్పొరేటర్లకు రూ.ఐదు లక్షల చొప్పున ఇచ్చేలా ఒప్పందం జరిగిందనే ప్రచారం జరుగుతుంది. మేయర్ పదవి తరఫున ఐదింట నాలుగో వంతు, డిప్యూటీ మేయర్ మిగిలిన ఒక వంతు మొత్తాన్ని ఇచ్చేలా నిర్ణయం జరిగిపోయిందనే ప్రచారం కార్పొరేషన్ పరిధిలో చక్కర్లు కొడుతున్నది. అయితే ఇదంతా ఒక ఎత్తయితే.. రెండు పార్టీలు కలిసినప్పటికీ వీరి సంఖ్యాబలం 21 దగ్గరనే ఆగిపోతుంది. అందుకే సాంకేతికంగా కావాల్సిన మిగిలిన వారి కోసం రెండు పార్టీల తరఫున అన్వేషణ సాగుతున్నట్లు తెలిసింది. దీంతో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంత విరుద్ధమైన పార్టీతో కలవడంతో పాటు మరో పార్టీ కార్పొరేటర్లకు గాలం వేసేందుకు ప్రయత్నిస్తుండటం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



# జూబ్లీహిల్స్‌లో హిట్ అండ్ రన్

**మితిమీరిన వేగంతో దూసుకువచ్చిన కారు**

**ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టి వెళ్లడంతో..**

**బౌన్సర్ మృతి, మరొకరికి తీవ్ర గాయాలు**

**ప్రమాదానికి కారణమైన కారును గుర్తించిన పోలీసులు**

బంజారాహిల్స్, జనవరి 24 : జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో 'హిట్ అండ్ రన్' కేసు నమోదైంది. అతివేగంగా దూసుకువచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిక్ విలేజ్ సమీపంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న లింగాల తారకరామ్(30) మాదాపూర్‌లోని నోవాటెల్ హోటల్‌లో బౌన్సర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. బుధవారం తెల్లవారుజామున విధులు ముగించుకొని తనతో పాటే పనిచేస్తున్న రాజు అనే మరో బౌన్సర్‌తో కలిసి ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఉదయం 5గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ రోడ్ నం 36లోని పెద్దమ్మ గుడి చౌరస్తా సమీపంలోకి రాగానే అతివేగంగా వెనుకనుంచి దూసుకువచ్చిన గుర్తుతెలియని కారు తారకరామ్ బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో గాల్లోకి ఎగిరిన తారకరామ్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌ను ఢీకొట్టిన కారు ఆగకుండా వెళ్లిపోయింది. వెనక కూర్చున్న రాజుకు తీవ్ర గాయాలుకాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు కేపీహెచ్‌బీ ప్రాంతానికి చెందిన వ్యాపారి ద్వారంపూడి నాగ పేరుతో ఉన్న వెర్నా కారు(టీఎస్08 జేఎన్ 6663)గా గుర్తించారు. కారు నడిపిస్తున్న యువకుడితో పాటు కారులో ఉన్న మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని, మృతుడు తారకరామ్ కుటుంబ సభ్యులకు నష్ట పరిహారం ఇప్పించాలంటూ బంధువులు, కుటుంబ సభ్యులు బుధవారం సాయంత్రం మృతదేహాన్ని తీసుకువచ్చి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచి ఆందోళనకు దిగారు.




ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

# పార్ట్ టైం లెక్చరర్ నియామకాల్లో అవకతవకలు

**విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల డిమాండ్**



ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 24 : ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో పార్ట్ టైం లెక్చరర్ నియామకాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తూ కళాశాల ఎదుట బుధవారం ఆందోళనకు దిగారు. కళాశాల ప్రిన్సిపల్, ఓఎస్డీ టు వీసీ ఇద్దరూ కలిసి తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇప్పించుకున్నారని ఆరోపించారు. ఈ ఉదాంతంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు అనుమానాలు ఉన్నాయని అన్నారు. తక్షణమే అవకతవకలకు పాల్పడిన వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పరిపాలనా భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు అశోక్‌నాయక్, సతీశ్‌గౌడ్, నాగరాజు, వెంకటేశ్, గణేశ్, ప్రవీణ్, గోపి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



# రాడిసన్‌లో.. పేకాట

**క్యాసినోను తలపించేలా ఏర్పాట్లు**

**కాయిన్స్ రూపంలో లక్షలాది రూపాయల జూదం**

**సినీ ఫక్కీలో డబ్బులు దోచుకుంటున్న ముఠా**

**నిర్వాహకుడితో సహా 13మంది అరెస్ట్**

బంజారాహిల్స్, జనవరి 24 : స్టార్ హోటల్‌లో గది అద్దెకు తీసుకొని క్యాసినోను తలపించేలా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బంజారాహిల్స్ పోలీసులు దాడులు జరిపి 13మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్ నెం 4లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో రూమ్ నం.319 అద్దెకు తీసుకొని, అందులో పెద్ద ఎత్తున పేకాట శిబిరం నడిపిస్తున్నారనే సమాచారం మేరకు బంజారాహిల్స్ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు జరిపారు. హోటల్ గదిని అద్దెకు తీసుకుని ఆన్‌లైన్‌లో కస్టమర్లను ఆకర్షిస్తూ క్యాసినో తరహాలో టోకెన్లు జారీ చేసి పేకాట శిబిరం నిర్వహిస్తున్న మహబూబ్‌నగర్‌కు చెందిన సింగిడి శ్రీనివాస్(44)తో పాటు పేకాడుతున్న మెర్విన్ కార్(35), సయ్యద్ నయీమ్(42), డియో గుర్మీత్ సింగ్(33), వి.సంతోష్‌కుమార్(40), రంగ సాయి కృష్ణ(28), ఎస్.శేఖర్(44), బి.వినోద్‌కుమార్(38), ఎస్.సూర్యచంద్ర(33), ఎం.వినోద్(28), ఎస్.వేణు(25), రుద్ర సరిత(38), జాల్లువ కుమారి(40)లను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి గాగుల్స్, ఇయర్‌ఫోన్లు, సెల్‌ఫోన్లతో పాటు రూ.32,47,000 విలువ చేసే టోకెన్లు, రూ.86,255 ఆన్‌లైన్ క్యాష్, రూ.2400 నగదును స్వాధీనం చేసుకున్నాడు. కాగా పేకాడుతున్న వారిలో 9మంది నిర్వాహకులు సింగిడి శ్రీనివాస్‌కు సంబంధించిన వారేనని, మిగిలిన నలుగురిని బోల్తా కొట్టించేందుకే వీరు పేకాట రాయుళ్ల అవతారం ఎత్తినట్లు పోలీసుల విచారణలో తేలింది. సినీ ఫక్కీలో క్యాసినో పేరుతో మోసం చేస్తున్న సింగిడి శ్రీనివాస్ గతంలోనూ పలు ప్రాంతాల్లో ఇదే విధంగా మోసాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



**పోలీసు రిహర్సల్స్** ▸ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్‌లోని ఆర్‌ఆర్‌సీ గ్రౌండ్‌లో రిహర్సల్స్ చేస్తున్న పోలీసులు, డాగ్‌స్క్వాడ్

# త్వరలోనే అర్హులకు డబుల్ బెడ్రూం ఇండ్లు

**ఉద్యోగులు విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు**

**ప్రతి నియోజకవర్గం అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయిస్తాం**

### జిల్లా అభివృద్ధి, పెండింగ్ పనుల పురోగతిపై మంత్రి పొన్నం సమీక్ష

సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో అర్హులైన వారందరికీ త్వరలోనే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారిగా బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాపై సమీక్షా సమావేశం నిర్వహించింది. జిల్లా అభివృద్ధి, సంక్షేమంతో పాటు పెండింగ్ పనుల పురోగతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన సమావేశానికి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కలెక్టర్ మధుసూదన్, డీఆర్‌ఓ వెంకటాచారితో పాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ఉన్న సమస్యలు, పురోగతి, అభివృద్ధి గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఏడు ప్రాంతాలలో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకుని త్వరలోనే అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయిస్తామని మంత్రి అన్నారు. ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గానికి రూ.10 కోట్లు కేటాయిస్తున్నామని, ఈ నిధులను అభివృద్ధి పనుల కోసం ఖర్చుచేయాలని సూచించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ భవనాన్ని నిర్మిస్తామని, అందుకు సంబంధించి త్వరలోనే భూ సేకరణ చేపడుతామని తెలిపారు.

### జిల్లాలో మోడల్ ఫిష్, వెజ్‌టేబుల్ మార్కెట్లు..



ప్రజల అవసరాలకు అనుగుణంగా జిల్లాలో ఫిష్ మార్కెట్లు నిర్మించే ఆలోచన ఉన్నదని, అవసరమైతే ప్రతి మండలంలో ఒక ఫిష్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అందుకు కావాల్సిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కాలేజీలు, బస్తీ దవాఖానలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు పెరిగిన డైట్ చార్జీలు అమలు చేస్తామని చెప్పారు. జీవో 58, 59 సంబంధించిన అంశాలను కూడా సమీక్షిస్తామని అన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు పరుస్తామని, దోబీఘాట్ల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ క్రమంలో జిల్లా రెవెన్యూ విభాగంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, శిశు సంక్షేమ శాఖ, వయోజన విద్య, చేనేత, ఉపాధి కల్పన శాఖ వంటి అంశాలపైనా మంత్రి చర్చించారు.